క్లుప్తంగా

నేడు మండల మీట్

నిండ్ర: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉప సర్పంచ్‌కి సత్కారం


మాజీ మంత్రి నివాసంలో ఉప సర్పంచ్, తదితరులు

విజయపురం: మండలంలోని ఇల్లత్తూరు సర్పంచ్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఉప సర్పంచ్ విజయరాఘవులును మాజీ మంత్రి ఆర్‌కే రోజా బుధవారం ఘనంగా సత్కరించారు. ఇల్లత్తూరు సర్పంచ్ దీప్త ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందడంతో ఉప సర్పంచ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రిని ఆమె నివాసంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

భూసార పరీక్షల మేరకు ఎరువుల వాడకం

నిండ్ర: మండలంలోని రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించి, వాటి ఆధారంగా ఎరువులు వాడుకోవాలని వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. బుధవారం నిండ్రలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, ఆధునిక విధానాలపై అవగాహన కల్పించారు.

కళాశాలలో నాగుపాము


పామును పట్టుకుంటున్న శ్రీకాంత్

పుత్తూరు: స్థానిక పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం ఓ నాగుపాము హల్‌చల్ చేసింది. అడ్మిషన్లు జరుగుతుండగా పామును గుర్తించిన విద్యార్థులు అధికారులకు తెలిపారు. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ శ్రీకాంత్ వెంటనే కళాశాలకు చేరుకుని సుమారు 4 అడుగుల నాగుపామును పట్టుకున్నారు. అటవీప్రాంతంలో సురక్షితంగా వదిలి పెట్టారు.

సిద్ధంగా వేరుశనగ విత్తనాలు

గంగాధర నెల్లూరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు పంపిణీ చేసేందుకు 1,539 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయశాఖాధికారి భవానీ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రైతులకు 40 శాతం సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. 30 కిలోల ధర రూ.2,790 కాగా రైతులకు రూ.1,674లకే పంపిణీ చేయనున్నట్లు వివరించారు. విత్తనాలు కావాల్సిన వారు ఆధార్, పాసు పుస్తకంతో వచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

గ్రీవెన్స్‌కు 4 సమస్యలు


సమస్యలను తెలుసుకుంటున్న డీఈ ఆనంద్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమంలో మొత్తం 4 సమస్యలపై వినతులు అందాయని డీఈ ఆనంద్ తెలిపారు. బంగారుపాళ్యం మండలంలో వ్యవసాయ సర్వీసులను గృహ సర్వీసుకు అనుసంధానం చేయాలని రెండు ఫిర్యాదులు, చిత్తూరు రూరల్స్, కొత్తపల్లెలో రివిజన్ ఆఫ్ బిల్లుపై ఫిర్యాదు అందిందన్నారు. గృహ సర్వీసుకు బిల్లును అనుసంధానం చేయించామన్నారు. రివిజన్ ఆఫ్ బిల్లును సరిచేశామని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఈ మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నుపోటు దినంలో భాగంగా నగరిలో చేపట్టిన భారీ ర్యాలీ



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కృపాలక్ష్మి



సర్కార్.. ఖబడ్దార్

"సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రజలను నమ్మించారు. ఓట్లు వేయించుకుని వంచించారు. అధికారం చేపట్టిన ఏడాదిలో స్కామ్‌లకే పాలనను పరిమితం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమంగా కేసులు నమోదు చేయిస్తున్నారు. ఇష్టారాజ్యంగా దాడులకు పాల్పడుతున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. బూటకపు హామీలతో జనం చెవిలో పువ్వులు పెట్టారు. ప్రశ్నించిన వారిని వేధించడమే పనిగా పెట్టుకున్నారు" అని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా, పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి ఆరోపించారు. బుధవారం నగరి, గంగాధర నెల్లూరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వెన్నుపోటు దినం చేపట్టారు. అశేషంగా హాజరైనా నేతలు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి సర్కార్.. ఖబడ్దార్ అంటూ హెచ్చరికలు జారీ చేశారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ మంత్రి రోజా


వినతి పత్రం అందిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కృపాలక్ష్మి

- చంద్రబాబు బూటకపు హామీలతో ప్రజలకు వెన్నుపోటు పొడిచారు
- ఏడాది పాలనలో అభివృద్ధి ఊసేలేదు.. అంతా అరాచకమే
- టీడీపీది మోసకారి మేనిఫెస్టో
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మాజీ మంత్రి రోజా, జీడీ నెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'
- పోటెత్తిన నేతలు, కార్యకర్తలు, ప్రజలు


వైఎస్సార్‌కు జోహార్లు అర్పిస్తున్న మాజీ మంత్రి రోజా, వైఎస్సార్ సీపీ శ్రేణులు

నగరి/కార్వేటినగరం/ గంగాధరనెల్లూరు: సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నమ్మించి సూపర్ స్కామ్‌లు చేస్తున్నారంటూ మాజీ మంత్రి ఆర్‌కే రోజా ఆరోపించారు. బుధవారం వెన్నుపోటు దినాన్ని పురస్కరించుకొని నగరి బైపాస్ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందించారు. అనంతరం ర్యాలీగా టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకుకని వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఆర్‌డీఓ భవానీ శంకరికి వినతిపత్రం అందించారు. రోజా మాట్లాడుతూ ఏడాది క్రితం అలవికాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రాన్ని దోచుకుంటూ అప్పుల్లో ముంచేస్తోందని విమర్శించారు. అందుకే ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ గళం విప్పిందని వెల్లడించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. చంద్రబాబు ఏరు దాటక ముందు ఓడ మల్లన్న, ఏరు దాటాక బోడిమల్లన్న అన్నచందాన పాలిస్తున్నాడన్నారు. తల్లికి వందనం, అన్నదాత, జాబ్ క్యాలెండర్ ఉద్యోగ భృతి, ఉద్యోగులకు ఐఆర్, డీఏ, ఉచిత బస్సు ఇలా నోటికొచ్చిందల్లా చెప్పేసారని ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి తప్ప రాష్ట్రంలో ఎవరూ ఇల్లు కట్టుకోలేదన్నారు. మహానాడుకు తప్ప ఉచిత బస్సు ఎక్కడకీ వెళ్లలేదని వివరించారు.

మాఫియా రాజ్యం

గంజాయి, ఇసుక, గ్రావెల్, మద్యం మాఫియాలు రాజ్యమేలుతున్నాయన్నారు. ఇప్పుడు సూపర్ శాసనాలంటూ కొత్త పాట మొదలుపెట్టారని ఆరోపించారు. ఈవీఎంలను మేనేజ్ చేసి గెలిస్తే పాలన ఇలాగే ఉంటుందని వెల్లడించారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగితే ఊరుకోనని చెప్పిన పవన్ కల్యాణ్ నేడు రాష్ట్రంలో జరుగుతున్న అత్యాచారాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టేందుకే చెవిలో పువ్వులు పెట్టుకుని ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, వైస్ చైర్మన్లు బాలన్, జయప్రకాష్, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, పార్టీ పట్టణ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, సీకే ఏకాంబరం, మండలఅధ్యక్షులు తిరుమలరెడ్డి, అన్నాలోకనాథం, శివరాజు, వేణురాజు, సుబ్రమణ్యంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బీడీ భాస్కర్, రైతు సంఘం నేతలు శ్రీనివాసులు రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి గోవర్ధన్ నాయుడు పాల్గొన్నారు.

తిరుగుబాటు మొదలైంది

కూటమి ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు మొదలైందని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. కార్వేటినగరం, జీడీనెల్లూరులో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు. నారాయణస్వామి మాట్లాడుతూ ఈ రోజు పండుగని చంద్రబాబు అనుకుంటున్నారని, దండగ అని ప్రజలు చెబుతున్న విషయం తెలియడం లేదని విమర్శించారు. అధికారం కోసం ఇచ్చిన మోసపూరిత హామీలే కూటమి ప్రభుత్వాన్ని దహించుతాయని తెలిపారు. పథకాలు అమలు చేయకుండా ప్రజలను మభ్య పెట్టేందుకు వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. తాటాకు చప్పుళ్లకు తాము భయపడే ప్రసక్తే లేదని వెల్లడించారు. ఊకదంపుడు మాటలు మాని, ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కృపాలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనకే జనాలకు విసుగు వచ్చిందన్నారు. నోటికొచ్చిన హామీలతో పేదలను ఆశపెట్టి కడుపు మీద కొట్టారని మండిపడ్డారు. హామీలు అమలు చేయకుంటే కూటమి సర్కార్ భూస్థాపితం కావడం తథ్యమని స్పష్టం చేశారు.

ర్యాలీ.. నివాళి

భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలతో కలిసి మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి ర్యాలీ చేపట్టారు. జీడీ నెల్లూరు పెట్రోల్ బంకు సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆర్ఐ ఏకాబరానికి వినతిపత్రం అందించారు. మాజీ డిప్యూటీ సీఎం స్థాయి వ్యక్తి వస్తే తహసీల్దార్ లేకపోవడం ఏంటని నారాయణస్వామి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు, నేతలకు కనీస మర్యాద కూడా దక్కడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న మాజీ మంత్రి రోజా, వైఎస్సార్‌సీపీ నేతలు


జీడీ నెల్లూరులో కదంతొక్కుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

నగరి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. భోజన నిర్వహణపై ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం పలు సూచనలు చేశారు. అనంతరం వంట కార్మికులకు ఫుడ్ మేళా కాంపిటీషన్ చేపట్టారు. విజేతలకు బహుమతులు అందజేశారు.


కార్మికులకు సూచనలిస్తున్న ఎంఈఓలు

దిగజారుడు రాజకీయం తగదు


మాట్లాడుతున్న కోలార్ ప్రకాష్

వెదురుకుప్పం: కూటమి నేతలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడడం తగదని వైఎస్సార్ సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ వైద్య విభాగం అధ్యక్షుడు కోలార్ ప్రకాష్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరైనట్లు వెల్లడించారు. పార్టీకి వస్తున్న ప్రజాదరణకు ఓర్వలేక కొందరు టీడీపీ నేతలు నీతిమాలిన పనులు చేస్తున్నారని మండిపడ్డారు. వివేకానందరెడ్డి గొడ్డలిపోటు అంటూ పనికిమాలిన పోస్టర్లు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది పాలనలో ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండా, ఇలాంటి అనైతిక చర్యలకు మాత్రమే పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు అన్నీ అర్థమయ్యాయని, కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని వెల్లడించారు.

రెండు నెలలుగా తాగునీటి కటకట


ద్విచక్రవాహనంలో నీరు తెస్తున్న గ్రామస్తుడు

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురం పంచాయతీ ఇందిరానగర్‌లో ప్రజలు రెండు నెలలుగా తాగునీటికి కటకటలాడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. భోజనం తయారు చేసుకోవడానికి నిత్యం రెండు కిలోమీటర్లు వెళ్లి వ్యవసాయ బోరు నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని తాగునీటి బోర్లు అడుగంటి పోవడంతో ఇక్కట్లు తప్పడం లేదని వెల్లడిస్తున్నారు. గ్రామంలో కూలి పనులు చేసుకునే వారే ఎక్కువగా ఉన్నారని, కష్టపడి పని చేసిన తర్వాత ఇంటికి వస్తే దాహం తీర్చుకునే అవకాశం కూడా ఉండడంలేదని మండిపడుతున్నారు. సర్పంచ్ అప్పుడప్పుడు ట్యాంకర్లతో నీటిని తీసుకువచ్చినా, ఒక వీధికి కూడా సరిపోవడం లేదని వివరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి ఇక్కట్లు తొలగించాలని కోరుతున్నారు.

గంగమ్మ సేవలో మాజీ మంత్రి రోజా


రోజాకు స్వాగతం పలుకుతున్న జాతర నిర్వాహకులు

నగరి: కీళపట్టు దళితవాడలో బుధవారం నిర్వహించిన గంగజాతరకు మాజీ మంత్రి ఆర్‌కే రోజా హాజరయ్యారు. అమ్మవారిని సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆమెను సాదరంగా ఆహ్వానించి, ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, కౌన్సిలర్ అన్నెమ్మ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


పాలసముద్రం : మాట్లాడుతున్న వెంకటరమణ


వెదురుకుప్పంలో మాట్లాడుతున్న జయరాజ్

పాలసముద్రం: దైనందిన జీవితంలో నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎం.వెంకటరమణ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బందికి యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెంకటరమణ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ వరకు యోగాపై గ్రామీణులు, యువతకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి మోహన్‌కృష్ణ, ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ, ఏఓ మధువాణి, ఐకేపీ ఏపీఎం కల్పలతారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: యోగాంధ్రను విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకుడు జయరాజు ఆదేశించారు. బుధవారం వెదురుకుప్పంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సచివాలయ సిబ్బంది సహకారంతో డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ కార్మికులకు యోగాలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎంపీడీఓ పురుషోత్తం మాట్లాడుతూ ప్రజలు సైతం యోగా శిక్షణకు హాజరుకావాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ బాబు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఎంఈఓ మహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీఓ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.